కలగానే డంపింగ్ యార్డు ఏర్పాటు

నియోజకవర్గ కేంద్రమైన సూళ్లూరుపేటలో ఎక్కడ చూసినా చెత్తాచెదారం దర్శనమిస్తోంది. మున్సిపాలిటీ అధికారులు చెత్త నిర్వహణను సక్రమంగా చేపట్టకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మేజర్ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా రూపాంతరం చెంది 14 ఏళ్లు అవుతున్నా డంపింగ్ యార్డును ఏర్పాటుచేయలేదు. కాళంగి నది పక్కనే జాతీయ రహదారికి ఆనుకుని చెత్త వేస్తున్నారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు ప్రతిపాదనలకే పరిమితమైంది.

– సూళ్లూరుపేట

- జాతీయ రహదారి వెంబడి వేస్తున్న చెత్త
- ప్రతిపాదనలకే పరిమితమైన సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంటు
- కలుషితమవుతున్న కాళంగినది



సూళ్లూరుపేట పట్టణంలోని కాళంగినదికి పక్కనే డంప్ చేసిన చెత్త

సూళ్లూరుపేట పట్టణం రోజురోజుకూ విస్తరిస్తోంది. సుమారు 95 వేల మందికిపైగా జనాభా ఉంది. పట్టణంలో పారిశుద్ధ్య పనులు చేపట్టడానికి 110 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వారిలో శాశ్వత ఉద్యోగి ఒకరు మాత్రమే. రోజూ 18 టన్నులకు పైగా చెత్త వెలువడుతోంది. చెత్తను తరలించేందుకు 9 వాహనాలు మాత్రమే ఉన్నాయి. డంపర్ బిన్లు ఏర్పాటుచేయలేదు. గతంలో ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించేవారు. ప్రస్తుతం ఆ విధానాన్ని తొలగించారు. సూళ్లూరుపేట మేజర్ పంచాయతీ నుంచి 2010లో గ్రేడ్–3 మున్సిపాలిటీగా రూపాంతరం చెందింది. ఇప్పటి వరకు చెత్త డంపింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయలేదు. దీంతో పట్టణంలో వెలువడిన చెత్తను కాళంగినదికి పక్కనే జాతీయ రహదారికి ఆనుకుని డంప్ చేస్తున్నారు. నెలలో నాలుగైదు సార్లు చెత్తను కాలుస్తుండడంతో పట్టణమంతా పొగలు వ్యాపించి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వట్రపాళెం, ఇందిరానగర్, మహదేవయ్య నగర్, వనంతోపు, గణపతినగర్, ఝాన్సీనగర్, శ్రీనగర్‌కాలనీ, సూళ్లూరు, నాగరాజుపురం ప్రాంతాల్లో పొగ కమ్ముకుంటుండడంతో స్థానికులు అల్లాడిపోతున్నారు. మరోవైపు కాళంగినది కలుషితమవుతోంది. భారీవర్షాలు కురిసి కాళంగినదికి వరద వస్తే చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు పులికాట్ సరస్సులోకి చేరుతున్నాయి.

ఊసేలేని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్లు

తడి, పొడి చెత్తను వేరు చేసి వర్మీకంపోస్టుతోపాటు ఎరువులు తయారుచేసేలా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కింద ప్లాంట్లు ఏర్పాటుచేయాలని అధికారులు భావించారు. ఇందులో భాగంగా మన్నారుపోలూరు వద్ద డంపింగ్ యార్డు ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. దీనిపై స్థానికుల నుంచి అభ్యంతరాలు వ్యక్తం కావడంతో ఈ ఫైలు ముందుకు కదల్లేదు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి చెత్త నిర్వహణకు తగిన చర్యలు తీసుకోవాలని, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్లు ఏర్పాటుచేయాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

సూళ్లూరుపేట పట్టణ జనాభా	: 95 వేలు
పట్టణం నుంచి రోజులకు వెలువడే చెత్త	: 18 టన్నులు.
చెత్త తరలించే వాహనాల సంఖ్య	: 9
పారిశుద్ధ్య కార్మికుల సంఖ్య	: 110 మంది

ముక్కులు మూసుకుని బ్రతుకుతున్నాం..



కాళంగినదికి పక్కనే చెత్త వేస్తున్నారు. దుర్గంధం వెదజల్లుతుండడంతో ముక్కులు మూసుకుని బతకాల్సి వస్తోంది. ఊరికి దూరంగా చెత్త డంపింగ్ యార్డును ఏర్పాటు చేయకుండా ఇళ్లలకు దగ్గరగా కాళంగి నది పక్కనే వేస్తున్నారు. వారంలో రెండుసార్లు చెత్తను కాలుస్తున్నారు. పొగతో ఊపిరితిత్తుల సంబంధమైన వ్యాధులొస్తున్నాయి. **- రజియా, వనంతోపు**

అనారోగ్యం బారిన పడుతున్నాము



చెత్త నుంచి వచ్చే దుర్గంధంతో ముక్కు పుటాలు పగిలిపోతున్నాయి. ఆనారోగ్యం బారిన పడుతున్నాం. దోమలు, ఈగలు, పందులు బెడద ఎక్కువగా వుంది. చెత్తను కాల్చినప్పుడు పొగతో ఊపిరితిత్తుల జబ్బులున్న వారు తట్టుకోలేకపోతున్నారు. ఊపిరి పీల్చుకోలేని పరిస్థితి. అధికారులు స్పందించి చెత్త డంపింగ్ కేంద్రాన్ని దూరంగా పెట్టాలి. **- హుస్సేన్, గణపతినగర్**

రాత్రిళ్లు ప్రమాదాల బారిన పడుతున్నాం



సుగ్గుపల్లి నుంచి సూళ్లూరుపేటకు రాకపోకలు సాగిస్తుంటాం. రోడ్డు మీదకు చెత్త వస్తుండడంతో రాత్రిళ్లు ప్రమాదాల బారిన పడుతున్నాం. జాతీయ రహదారి పక్కనే చెత్త వేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. కాళంగినదిని చెత్తతో నిండినా ఇరిగేషన్ అధికారులు నిమ్మకునీరెత్తినట్టు ఉన్నారు. ఇప్పటికైనా స్పందించాలి. **- గాలి మల్లికార్జున్‌రెడ్డి, మాజీ సర్పంచి, సుగ్గుపల్లి**

క్లుప్తంగా

శాకాంబరి అలంకరణలో పర్వతవర్ధని



రాపూరు: పట్టణంలోని పురాతన శివాలయంలో వెలసిన పర్వతవర్ధిని దేవి అమ్మవారు సోమవారం శాకాంబరి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ అర్చకులు రామనాథేశ్వరశర్మ మాట్లాడుతూ ఆషాడ మాసం ఆడికృత్తికను పురస్కరించుకుని అమ్మవారికి ఉదయం అభిషేకం, కుంకుమార్చన చేసినట్టు తెలిపారు. సాయంత్రం వివిధ రకాల కూరగాయలతో అలంకరించినట్టు పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న హెచ్‌ఎం

గూడూరు రూరల్ : విందూరులో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బాలికల జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు సోమవారం స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. పౌరశాస్త్ర అధ్యాపకుడు ప్రవీణ్‌గురు మాట్లాడుతూ పేద విద్యార్థులకు సహకారం అందించే క్రమంలో స్టడీ మెటీరియల్‌ను అందిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల హెచ్‌ఎం నాగమల్లికార్జునరావు పాల్గొన్నారు.

రాపూరులో వర్షం

రాపూరు: రాపూరులో సోమవారం సాయంత్రం గంటపాటు భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఉదయం నుంచి ఎండవేడిమితో ఇబ్బంది పడిన ప్రజలు చల్లని వాతావర్షం నెలకొనడంతో సంతోషం వ్యక్తం చేశారు. లోతట్టు ప్రాంతాల్లోకి వర్షపు చేరింది. వర్షం కురవడంపై నిమ్మ రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సుబ్రమణ్య స్వామికి ప్రత్యేక పూజలు

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని బ్రాహ్మణవీధిలోని శ్రీవల్లీ దేవసేన సమేత షణ్ముగ సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఆడికృత్తిక ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా చండియాగం చేపట్టారు. అమ్మవారి మహా స్వరూపమైన శ్రీచక్ర మహామేరువు ప్రతిష్టతోపాటు 108 వేలాధులకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఆడికృత్తిక రోజున ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకుడు చదలవాడ మోహన్‌కృష్ణ శర్మ తెలిపారు. ఉదయం భక్తులు 108 వేలాయుధాలను చేతపట్టుకుని పుష్ప కావడులతో స్వామివారి త్రిశూల ప్రదర్శనలతో నగరోత్సవం చేపడతామన్నారు. మధ్యాహ్నం స్వామివారి కల్యాణం చేస్తామని తెలిపారు.

ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలి

సైదాపురం : ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలని పూలే టీచర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి జీవీ రత్నం, రాష్ట్ర అధ్యక్షుడు అన్నం శ్రీనివాసులు, రాష్ట్ర కార్యదర్శి తుమ్మూరు రవి, బొమ్మిశెట్టి ప్రసాద్, సర్వేపల్లి భాస్కర్, నాప వేణుగోపాల్ కోరారు. వారు సోమవారం సైదాపురం మండలంలోని తురిమెర్ల, ఊటుకూరు, గిద్దలూరు స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని తుమ్మల తలుపూరు, కలిచేడు, గిద్దలూరు, ఊటుకూరు పాఠశాలల్లో సభ్యత్వ నమోదు చేయించారు. వారు మాట్లాడుతూ జీవో నంబర్ 117ను రద్దు చేయాలని, 3, 4, 5 తరగతులను వెనక్కు పంపాలని కోరారు. విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ఇద్దరు ఎస్జీటీ ఉపాధ్యాయులను నియమించాలని కోరారు.

కారు ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

గూడూరు రూరల్ : గూడూరు రూరల్ పరిధిలోని పోటుపాళెం క్రాస్ రోడ్డు వద్ద సోమవారం బైక్‌ను కారు ఢీకొనడంతో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. ఒంగోలుకు చెందిన నానీ అనే యువకుడు, అతని స్నేహితుడు కలిసి బైక్‌లో తిరుపతి వెళ్లారు. తిరిగి సోమవారం బయలుదేరారు. ఈ క్రమంలో పోటుపాళెం క్రాస్ రోడ్డు వద్ద పోటుపాళెం వైపు నుంచి వస్తున్న కారు ఢీకొంది. దీంతో బైక్ నుజ్జునుజ్జు అయింది. బైక్ నడుపుతున్న నానీకి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతన్ని 108 ద్వారా గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి నెల్లూరు తీసుకెళ్లారు. మరో యువకుడికి స్వల్ప గాయాలయ్యాయి. గూడూరు రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మెరుగైన విద్య అందించాలి

దక్కిలి: విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని ఎంఈవో వెంకటేశ్వర్లు ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన సోమవారం కందలవారిపల్లి ప్రాథమిక, దక్కిలి జెడ్పీ ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ దక్కిలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో వచ్చే ఏడాది నుంచి ఇంటర్మీడియట్‌ను ప్రారంభించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పెట్టాలని నిర్వాహకులకు సూచించారు. దక్కిలి కాంప్లెక్స్ హెచ్‌ఎం నాగరాజు, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సరళకుమారి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకులకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



కారూరులో మునుస్వామిరెడ్డితో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి, నాయకులు

తడ: ఇటీవల కుటుంబ సభ్యులు మృతి చెంది శోక సంద్రంలో ఉన్న పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, సానుభూతి పరులను సోమవారం సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పరామర్శించారు. తడ మండలం కారూరులో పార్టీ మండల నాయకుడు ఆంబాకం పార్థిపన్ తండ్రి సాంబశివరెడ్డి ఉత్తర క్రియలు సోమవారం నిర్వహించారు. కిలివేటి కారూరు చేరుకుని పార్థిపన్ కుటుంబ సభ్యులను ఓదార్చారు. అలాగే పార్టీ సీనియర్ నాయకుడు మునుస్వామిరెడ్డి భార్య అనారోగ్యంతో ఉన్నట్టు తెలుసుకుని ఆయనను పరామర్శించి ధైర్యం చెప్పారు. పార్టీ నాయకుడు కుప్పంపాటి మారెయ్య సతీమణి సెల్వి ఇటీవల ప్రమాదానికి గురై మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న కిలివేటి సూళ్లూరుపేట పట్టణంలోని సూళ్లూరు చేరుకుని వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం పార్టీ యువ నాయకుడు గుంపెళ్ల శశికుమార్ తండ్రి విజయ్‌కుమార్ మరణ వార్త తెలుసుకుని వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కుష్టువ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించాలి

కలువాయి: కుష్టువ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించి మల్టి డ్రగ్ థెరపీ చేయించుకుంటే అంగవైకల్యాన్ని పూర్తిగా నివారించవచ్చని డిప్యూటీ పారా మెడికల్ అధికారి ఎం.మోహన్‌రావు తెలిపారు. ఆయన సోమవారం కలువాయి జెడ్పీ ఉన్నత పాఠశాల, శివసాయి డిగ్రీ కళాశాల విద్యార్థులకు కుష్టువ్యాధిపై అవగాహన కల్పించారు. కుష్టువ్యాధి సోకడం వల్ల శరీరంలో కలిగే మార్పులను వివరించారు. అలాంటి లక్షణాలు ఎవరిలోనైనా గమనిస్తే మెడికల్ సిబ్బందికి తెలియజేసి, వారు సకాలంలో తగిన చికిత్స తీసుకునేలా చూడాలని సూచించారు. జాతీయ ఆరోగ్య మిషన్ కింద ఈ నెల 18వ తేదీ నుంచి ఆగస్టు 2 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం ఆయన కలువాయి ఎస్టీ కాలనీ, పడమటి వీధిలో పర్యటించి హౌస్‌మార్క్(ఎల్‌సీడీసీ)లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు విజయలక్ష్మి, అన్వర్‌బాషా, సూపర్‌వైజర్లు కె.రఘురామయ్య, కె.భాగ్యలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ చలమయ్య, ఏఎన్‌ఎం కె.సునంద పాల్గొన్నారు.

రొయ్యల పెంపక కేంద్రం తనిఖీ

వాకాడు : రైతులకు నాశిరకం రొయ్య పిల్లలు అందజేసే హేచరీల యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మత్స్యశాఖ ఒంగోలు జేడీ చంద్రశేఖర్ హెచ్చరించారు. ఆయన సోమవారం వాకాడు మండలం పంబలిలో వైష్ణవి హేచరీలో తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి నెల్లూరు జిల్లాలో మూడు హేచరీలకు మాత్రమే టైగర్ రొయ్య పిల్లల ఉత్పత్తికి అనుమతులు ఉన్నాయన్నారు. చాలా చోట్ల నాశిరకం సీడ్‌పై ఫిర్యాదులు అందాయన్నారు. పంబలి వైష్ణవి టైగర్ రొయ్య పిల్లల హేచరీలో అనుమానం ఉన్న బ్రోడర్స్(తల్లి రొయ్య)ల శాంపిల్స్ కాకినాడ ల్యాబ్‌కు పంపుతున్నట్టు తెలిపారు. రిపోర్టులో నాశిరకమని తేలితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. నెల్లూరు, గూడూరు ఏడీలు వీవీ రంగనాథ్‌బాబు, రాజేష్, ఎఫ్‌డీవో రెడ్డినాయక్ పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని నిరసన

గూడూరు రూరల్ : చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సీహెచ్ ప్రభాకర్ డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు సోమవారం చేనేత కార్మికులతో కలిసి గూడూరులోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ చేనేత సహకార సంఘాల పాలకవర్గాలకు ఎన్నికలు నిర్వహించాలని, చేనేత సహకార సంఘాల బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. సిల్క్‌కు ఇస్తున్న రాయితీని రూ.2 వేల నుంచి రూ.3 వేలకు పెంచాలన్నారు. చేనేత వస్త్రాలకు ప్రభుత్వం మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని, ఆదరణ పథకాన్ని పునరుద్ధరించి సబ్సిడీపై వృత్తి పరికరాలను అందజేయాలని విజ్ఞప్తి చేశారు. 11 రకాల చేనేత వస్త్ర ఉత్పత్తుల రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయాలని, చేనేత కార్మి కుల కోసం ప్రత్యేక బ్యాంకులు ఏర్పాటు చేసి రాయితీతో రుణాలు ఇవ్వాలన్నారు. నియోజకవర్గ కార్యదర్శి శశి, పట్టణ కార్యదర్శి కాలేషా, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు ఎంబేటి చంద్రయ్య, చేనేత కార్మికులు భాస్కర్, కోటయ్య, యశోదమ్మ తదితరులు పాల్గొన్నారు.

కన్వర్షన్ భూముల పరిశీలన

పెళ్లకూరు: మండలంలోని అక్కగారిపేట, అనకవోలు గ్రామాల్లో కన్వర్షన్ భూములను సోమవారం సూళ్లూరుపేట ఆర్డీవో చంద్రముని పరిశీలించారు. గ్రామానికి కేటాయించాల్సిన పది శాతం భూమిపై వెంచర్ యాజమాన్యంతో మాట్లాడినట్లు సమాచారం. నిబంధనల మేరకు వెంచర్ ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్, ప్రసాద్‌రావు, వీఆర్వో మొబీనా, సర్వేయర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

చిల్లకూరు : తీర ప్రాంతంలోని మోమిడిలో శశికుమార్, శేషేంద్ర జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. సోమవారం ఉదయం సర్వేపల్లి నియోజకవర్గంలోని ఈపూరువెంకన్న పాళెం, గుమ్మళ్లదిబ్బ కొత్తూరు జట్లు పోటీ పడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన ఈపూరువెంకన్నపాళెం జట్టు 11.5 ఓవర్లలో ఆల్ అవుట్ అయి 104 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన గుమ్మళ్లదిబ్బ కొత్తూరు జట్టు 11.1 ఓవర్లలో 74 పరుగులు చేసి ఆల్ అవుట్ అయ్యింది. ఈపూరువెంకన్నపాళెం జట్టు విజేతగా నిలిచింది. అలాగే చిట్టమూరు మండలం గునపాటిపాళెం, వాకాడు మండలం తూపిలిపాళెం జట్లు తలపడగా మొదట బ్యాటింగ్ చేసిన గునపాటిపాళెం జట్టు 11 ఓవర్లలో 67 పరుగులు చేసి ఆల్ అవుట్ అయ్యింది. తరువాత బ్యాటింగ్ చేపట్టిన తూపిలిపాళెం జట్టు 10.1 ఓవర్లలో 43 పరుగులు మాత్రమే చేసి ఆల్ అవుట్ అయ్యింది. దీంతో విజేతగా గునపాటిపాళెం జట్టు నిలిచింది. పోటీలను మోహన్, వినోద్, నాగరాజు, నిరీక్షణ పర్యవేక్షించారు.

ఇంటి వద్దే పింఛన్ల పంపిణీ

సైదాపురం: సామాజిక పింఛన్లను ఆగస్టు 1న ఇంటి వద్దే అందించేందుకు ఏర్పాట్లు చేశామని ఎంపీడీవో సుధాకర్‌రావు తెలిపారు. ఆయన సోమవారం పింఛన్ల పంపిణీపై సచివాలయ సిబ్బందితో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ పింఛన్‌దారులు ఎవరూ సచివాలయాలు, బ్యాంకుల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదని తెలిపారు.

రేపు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి పట్టణంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించేందుకు బుధవారం కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు కమిషనర్ అబ్దుల్‌షరీఫ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ అధ్యక్షతన జరిగే సమావేశంలో పట్టణంలోని 25 వార్డుల్లో చేపట్టాల్సిన అభివృద్ధి, నిర్వహణ కోసం 29 అంశాలతో కూడిన అజెండాను అధికారులు సిద్ధం చేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి

వెంకటగిరి రూరల్ : పట్టణంలోని 14వ వార్డులో నెలకొన్న ప్రజల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషిచేస్తానని కౌన్సిలర్ ఆరి శంకరయ్య తెలిపారు. పట్టణంలోని సుదర్శనం నగర్‌లో ఉన్న సచివాలయంలో సోమవారం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ బొగ్గులమిట్ట, ధర్మాపురం, నరసింహారావు వీధి, ముత్తరాశిపాళెం ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, వీధి లైట్ల సమస్యలు ఉన్నట్టు తన దృష్టికి వచ్చాయన్నారు. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

పశువులకు వైద్య చికిత్సలు

కోట: మండలంలోని గూడలిలో సోమవారం చిట్టేడు పశువైద్యశాల వైద్యుడు రాజేష్ పశువైద్య శిబిరం నిర్వహించారు. మేలుజాతి పశువుల అభివృద్ధిపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం 79 పశువులకు గర్భకోశ చికిత్స చేశారు. ఉచితంగా మందులు అందజేశారు. పశుసంవర్ధకశాఖ ఏడీ సుబ్రమణ్యం, సోమయ్య పాల్గొన్నారు

చెట్ల నరికివేతపై విచారణ

కోట: స్థానిక నార్త్ గిరిజన కాలనీ శ్మశానికి సంబంధించిన భూమిలో ఉన్న చెట్లను కొందరు నరికివేయడంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ నాగబాబు విచారణ జరిపారు. చెట్లను నరికిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గిరిజనులకు సంబంధించిన భూముల జోలికి ఎవరూ వెళ్లకూడదని ఆదేశించారు.

భూ ఆక్రమణలపై విచారణ జరపాలని వినతి

కోట మండలం మైక్రో టవర్ కాలనీ వద్ద గిరిజనులకు సంబంధించిన భూములను కొందరు భూస్వాములు ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నారని ఎస్‌ఎమ్మార్పీఎస్ నాయకులు ఆరోపించారు. వారు సోమవారం డీటీ మల్లికార్జున్‌కు వినతి పత్రం అందజేశారు. భూములను తిరిగి గిరిజనులకు ఇప్పించాలని కోరారు.

50 కుర్చీల వితరణ



కుర్చీలు అందజేస్తున్న జైనులు

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలకు సోమవారం స్థానిక జైన్ సంఘం నాయకులు 50 కుర్చీలు వితరణ చేశారు. వారికి ప్రిన్సిపాల్ దాదాఫీర్, వైస్ ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయులు బందిల శేఖర్ బాబు, వెంకటరమణయ్య, వెంకటకృష్ణయ్య, పూర్వ విద్యార్థి తొప్పని ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

దొరవారిసత్రం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని తూతూమంత్రంగా నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు విధిగా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించకుండా ఆలస్యంగా వచ్చి రిజిస్టర్‌లో సంతకాలు చేసి వెళ్లిపోయారు. ప్రతి సోమవారమూ ఇలా చేస్తున్నా పర్యవేక్షణ అధికారులు పట్టించుకోవడం లేదు. సోమవారం నిర్వహించిన ప్రజా వేదికలో తల్లంపాడు, బురదమడుగు తదితర గ్రామాలకు చెందిన ప్రజలు ఇళ్లు, పొర్లుకట్ట సమస్యలపై వినతులు అందజేసినట్టు ఇన్‌చార్జి తహసీల్దార్ గోపీనాథ్‌రెడ్డి తెలిపారు. ఎంపీడీవో శివరాజు, ఏపీఎం పద్మావతి, ఏవో జ్యోతిర్మయి, ఏఈ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ తవ్వకాన్ని అడ్డుకున్న గ్రామస్తులు



తిప్పగుంటపాళెం వద్ద తిప్పను తవ్వి గ్రావెల్‌ను తరలిస్తున్న ట్రాక్టర్లు

చిల్లకూరు : మండలంలోని తిప్పగుంటపాళెం సమీపంలో ఉన్న రొయ్యల గుంతల వద్దకు వెళ్లేందుకు రోడ్డు నిర్మించే సాకుతో తిప్పను తవ్వి గ్రావెల్‌ను తరలిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు సోమవారం తవ్వకాలను అడ్డుకున్నారు. గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు యల్లంటి సనత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఇంటి పనుల నిమిత్తం పేదలు ట్రాక్టర్ గ్రావెల్‌ను తీసుకు వెళ్లేందుకు ప్రయత్నించినా అధికారులు అడ్డు చెబుతున్నారని తెలిపారు. రోడ్డు నిర్మాణం పేరుతో స్థానిక రెవెన్యూ అధికారులకు వినతి పత్రం ఇచ్చి, దానినే అనుమతి పత్రంగా చూపి రెండు రోజులుగా గ్రావెల్‌ను తవ్వేస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయం తెలిసినా గనుల శాఖాధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. మండలంలోని పలు ప్రాంతాల్లో అక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తున్నప్పటికీ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు మిన్నకుండిపోవడం విమర్శలకు దారితీస్తోందన్నారు. నాయకులు పవన్‌రెడ్డి, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షా సప్తాహ్



శుభ దిన భోజనం వడ్డిస్తున్న తల్లిదండ్రులు

చిల్లకూరు : మండలంలోని ఓడూరు పంచాయతీ పున్నపువారిపాళెం ప్రాథమిక పాఠశాలలో సర్వశిక్ష ఆధ్వర్యంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ్ కార్యక్రమం సోమవారం ముగిసింది. ఇందులో భాగంగా విద్యార్థులు చిన్న చిన్న కిట్లు, దేశ నాయకులకు సంబంధించిన మోనో యాక్షన్‌లు చేసి చూపించారు. మధు టైల్స్ యజమానులు మధు, మదన్, ఎస్‌కే ఖాదర్‌మొహిద్దీన్, కె సిద్దయ్య దాతృత్వంతో విద్యార్థులకు మధ్యాహ్నం శుభదిన భోజనం ఏర్పాటు చేసి పిల్లలకు స్వీట్లు పంచి పెట్టారు. హెచ్‌ఎం స్వతంత్ర కుమారి మాట్లాడుతూ దాతలు పిల్లలకు ఇస్తున్న ప్రోత్సాహం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుబ్రమణ్యంరాజు పాల్గొన్నారు.

రాపూరులో..

రాపూరు:మండలంలోని పలు పాఠశాలల్లో సోమవారం శిక్షా సప్తాహ్ ముగింపు కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా తిథి భోజన్ నిర్వహించారు. ఎంఈవో జిలాని బాషా మాట్లాడుతూ పలు పాఠశాలల్లో దాతల సహకారంతో విద్యార్థులకు భోజన సదుపాయం కల్పించామన్నారు. రాపూరు సమీపంలోని మద్దెలమడుగు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థిని శ్రీవిద్య తండ్రి శ్రీనివాసులు భోజన వసతి కల్పించాలన్నారు. అలాగే సిద్ధవరం పాఠశాలలో దాత మధురెడ్డి చిన్నారులకు పండ్లు, స్వీట్లు అందజేశారు. ఉపాధ్యాయులు గౌస్‌మొహిద్దీన్, రేణుక పాల్గొన్నారు.

తడలో..

తడ: మండలంలోని కారూరు పంచాయతీ, ఖాశింగాడుకుప్పం ప్రాథమికోన్నత పాఠశాలలో ఏడు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ్ సోమవారం ముగిసింది. ఇందులో భాగంగా కమ్యూనిటీ ఇన్‌వాల్వ్‌మెంట్ డే (సమాజ భాగస్వామ్య దినోత్సవం) నిర్వహించారు. ఇందులో ఎంఈవోలు సరస్వతి, మల్లికార్జునరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ అంశాల్లో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల నాయకుడు ఆర్‌కే సుందర్‌రెడ్డి, ఉప సర్పంచ్ దేశింగ్, ఎస్‌ఎంసీ చైర్మన్ శశికుమార్, హెచ్‌ఎం రఘురామయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం పంపిణీ

దొరవారిసత్రం : చందనముడి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఏడో రోజు సోమవారం తిథి భోజన్ సందర్భంగా జై భీమ్ ట్రస్ట్ సహకారంతో విద్యార్థులకు పౌష్టికాహారం అందజేశారు. ఇక్కడి విద్యార్థులకు నెలలో ఒకరోజు తిథి భోజన్ అందిస్తామని ట్రస్ట్ వైస్ చైర్మన్ సంధ్యారాణి హామీ ఇచ్చారు.



దొరవారిసత్రం : భోజనం చేస్తున్న విద్యార్థులు

కార్యక్రమంలో హెచ్‌ఎం శేషయ్య, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఓజిలిలో..

ఓజిలి: చిన్నతనం నుంచి క్రమశిక్షణతో చదువుకుంటే ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కనుమూరు గోపాల్‌రెడ్డి తెలిపారు. అత్తివరం ఉన్నత పాఠశాలలో సోమవారం శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా 140 మంది విద్యార్థులకు పౌష్టికాహారం అందజేశారు. కనుమూరు గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ విద్య అందుతోందన్నారు. ఇక్కడి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, మౌలిక సదుపాయాలను కల్పించినట్టు చెప్పారు. విద్యార్థులు కష్టపడి చదివి పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శోభనాకుమారి, సర్పంచ్ సాలు రమణయ్య, టీడీపీ నాయకులు ఎల్లు గురుమూర్తి పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

దక్కిలి: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఎంపీపీ గోను రాజశేఖర్ ఆకాంక్షించారు. మండలంలోని చాపలపల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం శిక్షా సప్తాహ్ ముగింపు కార్యక్రమంలో భాగంగా తిథి భోజన్ ఏర్పాటుచేశారు. అదే విధంగా మిట్టవడ్డీపల్లి ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం మల్లికార్జునరావు విద్యార్థులు, తల్లిదండ్రులకు భోజనం, పాయసం, అరటి పండ్లు అందజేశారు. ఎంఈవో–2 జగదీష్, ఉపాధ్యాయులు సత్యాల ప్రభావతి, అంగనవాడీ కార్యకర్త నాగమణి పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్ : ప్రభుత్వ పాఠశాలల్లో వారం రోజులుగా నిర్వహించిన శిక్షా సప్తాహ్ సోమవారం ముగిసింది. పెళ్లకూరు మండలం పేన్నేపల్లి మాజీ సర్పంచ్ గాలి రమేష్ నాయుడు తమ తల్లిదండ్రులు గాలి మాధవ నాయుడు, రాధమ్మ జ్ఞాపకార్థం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు విందు భోజనం పెట్టారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సురేష్ బాబు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పసల గంగాప్రసాద్ పాల్గొన్నారు.



తడ: మాట్లాడుతున్న ఎంఈవో సరస్వతి